

# ఎగిరే మనసు

వాణీ సబ్నవీస్

- బారెడు పొద్దెక్కినా కొడుకు మేడదిగి కిందికి రాకపోవడంతో కాంతమ్మ పైకి వచ్చింది.

సత్యం పడుకునే మంచం ఖాళీగా వుంది కాంతమ్మ అక్కణ్ణుంచి బాల్కనీలోకి వచ్చిచూసింది.

మేడపైకి పాకిన కాశీరత్నం తీగకి పక్కగా నుంచున్నాడు సత్యం.

వాడెందుకు అక్కడ నుంచున్నాడో కాంతమ్మకి తెలుసు. గుండెల్లో సన్నగా బాధ చెలరేగింది.

చాలాసార్లు సత్యం అలా నిలబడి కాంపౌండు గోడకవతలవేపు వున్న గుడెసెలవేపు ఆసక్తిగా చూస్తుండడం కాంతమ్మ ఎరిగినవిషయమే.

నిండా వాడికి పద్దెనిమిదేళ్ళు లేవు. ఈమధ్యనే స్కూలుఫైనల్ పాసయి, పట్నంలో కాలేజీలో చేరాడు. శెలవులకని ఇంటికొచ్చి పదిరోజులైంది. వచ్చిన దగ్గరనుంచి ఇదే వాలకం సత్యానిది.

అప్రయత్నంగానే కాంతమ్మ కొడుకు

పక్కకినడిచివెళ్ళింది ఏదోఅనబోతున్న కొడుకుని,

"క్రిందకి పద" అన్నది, అతను మాట్లాడే అవకాశాన్ని వ్వకుండా.

తలొంచుకుని మౌనంగా మెట్లవైపు నడిచాడు. అడుగుముందుకు వెయ్యబోయి, ఆగి పిట్టగోడనుంచి ఎదురు మైదానంలోవున్న 'చుక్కమ్మ' గుడిసె వైపు చూసింది శాంతమ్మ.

మేడవంక చూస్తోన్న చుక్కమ్మ కళ్ళకి సత్యం బయలు శాంతమ్మ కనబడేసరికి కంగారుగా గుడిసెలోకి వెళ్ళిపోయింది చుక్కమ్మ.

బరువెక్కిన గుండెతో శాంతమ్మ మెట్లవైపు నడిచింది

—ఆపేట మొత్తంలో ఆ ఇల్లు ఎత్తైనదీన్నూ, మరీ అందంగానూ కనిపిస్తుంది. కంట్రాక్టరు పరంధామయ్యగారిది ఆ ఇల్లు కంట్రాక్టుపనిలో రెండు చేతులా ఆర్జించి, ఆ రెండతస్థులమేడని కట్టించేరు.

ఆ మేడకు చుట్టూప్రహరీ, ఆ ప్రహరీలో అందమైనతోట, ఆ ఇంటికి సరిపడ్డ జనాభా లేకపోయినా, హోదాకు తగినట్టు నౌకర్లూ ఉన్నారు.

ఆ కంట్రాక్టరుగారు బ్రతికినన్ని రోజులు భోగాలు అనుభవించేరు. బాధ అనేమాటకి సరైన అర్థం ఆయనగారికి తెలీదు అంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు

పరంధామయ్యగారికి కొడుకంటే పంచప్రాణాలును. అందుకే పోయే ముందు భార్యకి చెప్పి చెప్పి మరీ పోయారు. తన కొడుకు డాక్టరు కావాలన్న తన కోరికని. కన్నకొడుకు తనని మించినవాడైతే చూసి సంతోషించాలన్న తపనమాత్రం ప్రతీతండ్రికి వుంటుందని చివరిక్షణాల్లో– తన మనసులోని కోరికని భార్యముందు వెల్లడించి తీర్చుకొన్నారు.

అంతేకాక కొంత ఉదారతని అలగా జనంపై చూపించి, మెప్పుపొందారు. ఆ మేడముందువున్న గుడిసెల తాలుకు స్థలం ఆయనగారిదే. ఏలాంటి పరిస్థితిలోనూ అందులోని, జనాన్ని తరిమివేయడానికి వీల్లేదని, అలా ఎవరైనా చేస్తే తన ఆత్మకి 'శాంతి' వుండదనీ భార్యదగ్గర మాటనీ తీసుకొన్నారు.

తనవిషయంలోఎప్పుడూ ఏ విషయంలోనూ ఏ విధమైన శ్రద్ధనీ ఆయన చూపెట్టకపోయినా, 'శాంతమ్మ' అని తనకిగల పేరును సార్థకం చేసుకోడానికన్నట్టుగా కొద్దిక్షణాల్లో కళ్ళు మూయబోయే భర్తకి మాటఇచ్చింది.

ఆ ఇంటి ముసలిసింహంపోయినాలుగు సంవత్సరాలు అయింది. ఆ మేడకట్టి ఆరుసంవత్సరాలు.

భర్తకిచ్చిన మాటని శాంతమ్మ నిలుపుకోడంచేత ఎదురుగుడిసెలుఅలాగే

వున్నాయి. గుడిసెల్లోని అలగా జనం అలాగేవున్నారు.

తండ్రి బ్రతికున్న రోజుల్లో సత్యం చిన్నసైజు యువరాజులా వుండేవాడు. సత్యం మనసుకి ఏమాత్రం కష్టం కలిగినా కారణాన్ని వెదికి తెలుసుకోనిదే పరంధామయ్యగారు నిద్రపోయేవారు కాదు.

తనభర్త ప్రవర్తన ఎలాంటిదో తెలిసింది అవటంచేత, కొడుక్కి ఆయన గారి కోరిక లెక్కదొచ్చి పడతాయోనని ఆవిడ భయం. వాడు డాక్టరు కావాలన్న భర్తకోరికని ఈడేర్చడానికి ఆవిడ ఎంతశ్రమనైనా పడగలదు.

కానీ వాడు ఈవిధమైన వ్యాపకాలతో ఎక్కడ పాడయిపోతాడో అన్న బెంగమాత్రం అనుక్షణం తినేస్తుంది.

పదిరోజుల్నుంచీ వాడు చుక్కమ్మ కేసి చూడ్డం, అది నవ్వడం చూస్తుంటే వళ్ళు దహించుకొనిపోతోంది.

—చుక్కమ్మకి దాదాపు ముప్పై సంవత్సరాలుంటాయి. అయినా మనిషి మంచి వళ్లతో పిటపిటలాడుతుంటుంది. మోకాళ్ళవరకూ బిగించి, కచ్చబోసి కట్టిన చీరలో ఒంటి సొంపులు బాగా కనిపిస్తుంటాయి. నడుస్తున్నప్పుడు లయబద్ధంగా చప్పుడవుతాయి కాళ్ళ వెండి కడియాలు, గొలుసులూ, చేతి గాజులు.

మనిషి నల్లటి నలుపేఅయినా ఆకర్షణీయంగా వుంటుంది చుక్కమ్మ అంత వయసుదీకూడా ఇరవైఏళ్ళ పడుచు పిల్లలా ఎదటివారిని తనచూపులతో కవ్విస్తూ వుంటుంది.

ఆ ఇల్లు కడుతున్నపుడు చుక్కమ్మ దాని భర్తతోకూడా, కూలికివచ్చేది. ఆ ఇంటి ఇటుకలన్నీ దానిచేతులుమీదుగా దాటి అందమైన మేడగా రూపం దిద్దుకొన్నాయి. చుక్కమ్మ అందాన్ని మేడలోనూ, మేడ అందాన్ని చుక్కమ్మలోనూ, తనివిదీరా, చూసుకొని మురిసిపోయేవాడు పరంధామయ్య.

కడుతున్న మేడమీద మక్కువకంటే చుక్కమ్మపైన అభిమానం ఎక్కువగా చూపేవాడు పరంధామయ్య. అప్పట్లో ఏదో పండగకి దానికి ఓచీరకూడా కొనిచ్చాడు. అప్పుడుగానీ దానిపట్ల భర్తకెలాంటి వుద్దేశ్యం వున్నదీ శాంతమ్మకి తెలీలేదు.

చుక్కమ్మ వయసుకీ, వాడి వయసుకీ ఎంతో తేడావుంది. పసివాడు అన్న జ్ఞానంకూడా దానికి లేకుండా అది వాడ్ని కవ్వించడం చాలా విపరీతంగా అనిపించింది. అదీకాక, అది కూలీచేసుకునేది. తనబిడ్డ లక్షాధికారి. చుక్కమ్మను పిలిచి మందలించడం తప్ప వేరేమార్గం ఏమీ గోచరించలేదు. కానీ, తక్కువ జాతి మనిషి నోరుపారేసే ప్రమాదం జాస్తి. గుడిసెలోవాళ్ళందరూ ఇంటిపైన పడతారు.

కొడుక్కి ఇంకా పదిహేనురోజులు సెలవులున్నాయి. కానీ వాడ్ని ఇక్కడ వుండనివ్వడం అంత శ్రేయస్కరం అనిపించడంలేదు.

—కొడుకు భోజనంచేస్తుండగా అన్నది శాంతమ్మ.

"బాబూ, హాస్టల్లో భోజనం అదీ బాగుండదని చెప్పావుకదూ ?" అడిగింది

సత్యం తల్లికళ్ళలోకి చూసేడు

"అవును" అన్నాడు.

శాంమ్మ నవ్వడానికి ప్రయత్నం చేసింది.

"ఇక్కడుండి నేనుమాత్రం చేసేదే ముంది. నీ చదువు పూర్తయ్యేవరకూ నేనూ వచ్చేస్తాను."

"మరి ఈ ఇల్లు ?" అన్నాడు.

శాంతమ్మ ముక్తసరిగా అంది.

"అద్దెకిచ్చేస్తాను.మనం రెండ్రోజుల్లో ప్రయత్నాలు పూర్తి చేసుకుని వెళ్ళిపోదాం" అంది.

సత్యం భోజనంముగించి లేచిపోయాడు

శాంతమ్మ అలా చేయడానికి నిశ్చయించుకోడానికి తగిన కారణాలు లేకపోలేదు. కొంచెం ఆకర్షణగా కనబడే సరికి సర్వాన్ని విస్మరించే చుక్కమ్మ కోసం తపనపడే సత్యం, పట్నంలో చెడిపోగల ప్రమాదాలున్నాయని ఆవిడ గ్రహించింది. .

వాడికివున్న గార్డియన్ తనొక్కతే. తనేవాడిని కాపాడుకొని ప్రయోజకుడ్ని చెయ్యాలి. ఒక పద్ధతిలో క్రమశిక్షణలో చదువు పూర్తిచేసుకొని, ఒక ఇంటి వాడుకావాలంటే తనీనిర్ణయం తీసుకోక తప్పదు.

ఈ ఆలోచనవచ్చిన తర్వాత, శాంతమ్మ తేలిగ్గా వూపిరి తీసుకో కలిగింది.

ఆ రాత్రి తేలిగ్గా నిద్రపట్టింది శాంతమ్మకి. మధ్యలో ఎమరుపాటున మెలకువవస్తే పక్కమంచంవేపు చూసింది. సత్యంలేడు.

శాంతమ్మ బాల్కనీ దగ్గరకి నడిచింది. పట్టపగ్గాలు లేకుండా విరగ కాస్తున్న వెన్నెల్లో - తోటలో మామిడి చెట్టుదగ్గర సత్యం, సత్యం పక్కన మరొకతె నించున్నారు.

శాంతమ్మ మెల్లిగా లేచి కిందివరండా లోంచి, తోటలోకివచ్చి సరువుమొక్కల గుబురు దగ్గర నించుంది. ఆవిడగుండె వేగంగా కొట్టుకొంటుంది.

—"తప్పు, బాబూ' నువ్వు నన్ను ఆశించకూడదు." చుక్కమ్మ గొంతు సన్నగావుంది.

"తప్పులేదూ, వప్పులేదూ లేకపోతే నిన్ను పనికట్టుకొని, మరీ పిలిపించింది. ఎందుకోసం ? కాదనకు ప్లీజ్. నువ్వు నాకు కావాలి." ఆవేశంగా అంటున్నాడు సత్యం చుక్కమ్మ చేతులు పట్టుకొని.

గాజులచప్పుడు వినిపిస్తుంది.

"వదలు బాబూ, నువ్వు తప్పుపని చెయ్యకూడదు" చుక్కమ్మ భయంగా అంటోంది.

"ఏం ఎందుకు చెయ్యకూడదు?" నిలదీసి సత్యం అడుగుతున్నాడు. చుక్కమ్మ అంటోంది.

"మీరు నాకంటే చాలా చిన్నోరు బాబూ. పసోరు మీరు" అంది.

"అంత మనసులేనిదానివి, రోజూ నేను మేడమీద నించున్నప్పుడు నన్ను చూసి, చిరునవ్వు నవ్వుతున్నావ్ ఎందుకు? నన్నెందుకు కవ్విస్తున్నావు! ఇవన్నీ చేస్తున్నప్పుడు నీకంటే వయసులో చిన్నవాడినని తప్పని అప్పుడు తెలియలేదా?

చాలా మెల్లిగా అన్నది చుక్కమ్మ

"నేను మేడవైపు చూసేది నీకోసం కాదుబాబూ!"

"మరెవరికోసం?"

"చెప్పటం అవసరమా?" అతని కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

"చెప్పితీరాలి లేదా ఈ రోజు నువ్వు నా కోరిక తీర్చాలి,

లేకపోతే బలవంతంగానైనా నిన్ను అనుభవిస్తాను" ఆ గొంతులో పట్టుదల బాగా కనిపిస్తుంది.

చుక్కమ్మ చెవులుమూసుకొంది.

"బాబూ, మేడ ఈ రూపం ఎత్తటానికి తోటిజనంతో పాటు నా కష్టాన్ని కూడా ధారపోశాను, ఎండనక వాన అనక, నా కష్టానికి ఫలితం ఈరూపంలో కనిపిస్తుంటే ఎంతో ఆనందంగా వుంటోందినాకు"

ఆమెకళ్ళల్లోకి గుచ్చిగుచ్చి చూస్తూ అన్నాడు సత్యం,

"కబుర్లతో అసలువిషయం దాటించేయాలని చూస్తున్నావా? వల్లకాదు" అంటూ ఆమెను బలవంతాన కౌగలించుకొన్నాడు.

చుక్కమ్మకి మతిపోయింది.

అతన్ని విదిలించుకొంది

"బాబూ! ఈ చీర ఎక్కడిదో తెలుసా! మీనాన్నగారు కొనిచ్చారు నన్ను ముట్టుకోకు. నేను జాతితక్కువదాన్నైనా, నీతిలేనిదాన్నైనా, మనిషినేబాబూ! నేను నీకు తల్లిలాంటిదాన్ని" అందిచుక్కమ్మ. ఆ క్షణంలో చుక్కమ్మ కళ్ళల్లో మెరిసిన కన్నీరు సత్యం గుండెల్ని చీల్చిచెండాడి వుండాలి.

అంతవరకూ ఆవేశంతో ఎగిరి ఎగిరి పడిన అతని మనసు రెక్కలు తెగి కింద పడిపోయింది.

చుక్కమ్మ అక్కణ్ణుంచి విసురుగా గేటువేపు పరుగెత్తింది. చుక్కమ్మ కాళ్ళ కడియాల చప్పుడు చెవుల్లో మారుమ్రోగుతుండగా, శాంతమ్మ, కొడుకు చూడకుండా లోపలికి నడిచింది.

